క్లుప్తంగా

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని బొల్లవరం గ్రామంలో నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని సర్పంచ్ లక్ష్మిదేవమ్మ అన్నారు. శనివారం గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో ప్రజలకు నీటిని అందించేందుకు గ్రామ పంచాయతీ నిధులు రూ. లక్ష వెచ్చించి నూతన మోటార్లను ఏర్పాటు చేయించారు. నూతన మోటార్లకు కరెంట్ సప్లయ్ అందించి ప్రజలకు నీటిని విడుదల చేయనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాఘవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ



బాధితుడిని పరామర్శిస్తున్న దామగట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు

నందికొట్కూరు రూరల్ : నందికొట్కూరు మండలం దామగట్ల గ్రామానికి చెందిన కె.రాజు అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు బైరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి కర్నూలులోని ప్రభుత్వాసుపత్రికి వెళ్లి పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. బాదితుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

పశుగ్రాసం దగ్ధం

మహానంది: మండల కేంద్రమైన బండిఆత్మకూరులోని వీవర్స్ కాలనీలో శనివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కాలనీకి చెందిన పాడిరైతు లక్ష్మీదేవికి చెందిన పశుగ్రాసం కాలి బూడిదైంది. స్థానికులు వెంటనే నంద్యాల అగ్నిమాపక కేంద్రం సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. పశుగ్రాసం కాలిపోవడంతో బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు.

21న ఓంకారంలో వేలాలు

మహానంది : బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన ఓంకారంలో ఈ నెల 21న బహిరంగ వేలాలు నిర్వహించనున్నట్లు ఈఓ ఏ.నాగప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ క్షేత్ర పరిధిలో టెంకాయలు అమ్ముకునేందుకు, ఐస్‌క్రీం బండ్ల నిర్వహణ, పాదరక్షలు భద్రపరుచుకునేందుకు బహిరంగ వేలాలు ఉంటాయన్నారు. ఆసక్తి కలిగిన వారు రూ.పదివేలు డిపాజిటు చెల్లించి వేలాల్లో పాల్గొనాలని కోరారు. ఇదిలా ఉండగా ఇప్పటికే రెండు సార్లు బహిరంగ వేలాలు నిర్వహించగా వాయిదా పడిన విషయం తెలిసిందే. దీంతో ముచ్చటగా మూడోసారి అయినా జరిగేనా అంటూ మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

చర్యలు తీసుకోవాలి

జూపాడుబంగ్లా: లక్ష్మాపురం సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు నుంచి కలుషిత నీటిని సరఫరా చేస్తున్న సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ పార్టీ నాయకుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ లక్ష్మాపురం సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు నుంచి మండలంలోని మండ్లెం, తర్తూరు, తంగడంచ, భాస్కరాపురం, పారుమంచాల, 80బన్నూరు, జూపాడుబంగ్లా, పి.లింగాపురం గ్రా మా లకు తాగునీటిని సరఫరా చేయాల్సి ఉందన్నారు. సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు నుంచి ఆయా గ్రామాలకు తాగునీరు సరఫరా అయ్యే పైపులు లీకేజీ కావటంతో నీరు కలుషితమవుతున్నా అధికారులు, కాంట్రాక్టర్ పట్టించుకోవటం లేదన్నారు.

నల్లమలలో మంటలు



మంటలు చెలరేగుతున్న దృశ్యం

మహానంది: నల్లమల అడవుల్లో మంటలు చెలరేగుతున్నాయి. కొద్దిరోజుల క్రితం నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులోని చలమ రేంజ్ పరిధిలో వెదురు కూపులు కాలిపోయిన విషయం తెలిసిందే. తాజాగా మహానంది ఆలయం వెనుక ఉన్న నల్లమల అడవిలో మంటలు వ్యాపిస్తుండటం పర్యావరణ ప్రేమికులకు ఆవేదన కలిగిస్తుంది. నల్లమలలో వేసవికాలంలో అడవులు కాలిపోకుండా తగిన రక్షణచర్యలు తీసుకుంటున్నామన్న అటవీశాఖ అధికారులు కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అడవులు కాలిపోకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గోపిశెట్టి వెంకటేశ్వరరావు మృతి తీరని లోటు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రముఖ విద్యాసంస్థల అధినేత వెంకటేశ్వర రావు ఆకస్మిక మరణం తీరని లోటని జై భారత్ నేషనల్ పార్టీ అధినేత జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం ఆ కళాశాల పూర్వ విద్యార్థి శివరామ కృష్ణా ద్వారా వెంకటేశ్వర రావు మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని ఆయన గృహానికి వెళ్లి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వసుంధర, పాఠశాల కరస్పాండెంట్స్ గంజి మోహన్ కుమార్, దాసు, పురుషోత్తంరెడ్డి, శౌరి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలకు సెల్యూట్



ఆత్మకూరులో ఎమ్మెల్యే శిల్పా ప్రసంగం వింటున్న వలంటీర్లు



వెలుగోడులో వలంటీర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

- కరోనా సమయంలో ప్రాణాలు ఫణంగా పెట్టి సేవలు
- ఎథిక్స్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- ఆత్మకూరు, వెలుగోడులో వలంటీర్లకు సత్కారం

ఆత్మకూరు: ప్రతి ఇంటికి అవినీతిలేని సేవలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను, ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ చేరుస్తున్న ప్రతి గ్రామ వలంటీర్‌కు సెల్యూట్ చేస్తున్నానని ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా కార్తీక్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్ అంటే ఓ వ్యవస్థ అని.. నమ్మకం, ఓ భరోసా అని అన్నారు. వలంటీర్ గ్రామంలో తనకు కేటాయించిన 50 ఇళ్లలో అవ్వా, తాత, అక్కా, చెల్లి, చిన్నమ్మ పెద్దమ్మ, చిన్నాన్న, పెద్ద నాన్న అంటూ ఆప్యాయతతో పలకరించి, సేవలందించి వారి హృదయాలను చొరగొన్నారన్నారు. కరోనా సమయంలో ప్రాణాలు ఫణంగా పెట్టి ఇంటింటికీ తిరిగిన గ్రామవలంటీర్ల సహసం అద్వితీయమని ప్రశంసించారు. టీడీపీ ప్రభుత్వానికి వలంటీర్లు అంటే భయం పుట్టుకొస్తుందన్నారు.

చంద్రబాబు మోసపూరిత మాటలు నమ్మొద్దు

ఎన్నికలు సమీపిస్తున్నందున టీడీపీ నేత చంద్రబాబు నాయుడు ఎన్నో హామీలు ఇస్తారని, ఆయన మోసపూరిత మాటలు ప్రజలు నమ్మవద్దని ఎమ్మెల్యే అన్నారు. ఆయన సీఎంగా ఉన్న సమయంలో ఏ హామీలు నేరవేర్చారో ప్రతి ఒక్కరూ ఆలోచించాలని కోరారు. రైతులకు రుణమాఫీ చేస్తానని ఇచ్చిన హామీ నేరవేర్చాడా ?, పొదుపు మహిళల రుణాలు రద్దుచేస్తానని చివరికి పసుపు కుంకుమ పేరుతో రూ.10వేలు మహిళల మొఖాన పడవేశారన్నారు. అవికూడా మూడువిడతలుగా చెల్లించారన్నారు. మహిళలు బ్యాంకుల్లో పెట్టుకున్న తాకట్టు బంగారు రుణాలు మాఫీ అయ్యాయా? అని ప్రశ్నించారు. ఇచ్చిన హమీలు నవరత్నాలు పథకాల ద్వారా ఇంటింటికీ అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. 98 శాతం హామీలను నేరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే బూతుపురాణాలను పటించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. అలాంటి దుర్మార్గపు నాయకులకు ఓటుద్వారానే ప్రజలు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. గ్రామవలంటీర్ల వ్యవస్థ కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

వలంటీర్లు అంటే ఓ ఎమ్మెల్యేలా హుందాగా ఉండే వ్యవస్థ అని మీ గ్రామంలో, మీ ఏరియాలో మీరే హీరోలని, మీ సేవలు ప్రశంసనీయమని శిల్పా కార్తీక్‌రెడ్డి అన్నారు. ప్రతిఒక్కరు వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. అనంతరం వలంటీర్లను సన్మానించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గం నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ రాజగోపాల్, సూల్తాన్, కుందూరు శివారెడ్డి, విజయచౌదరి, పువ్వాడ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు గిరిజన సంఘం నాయకుల సన్మానం

పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, తనయుడు శిల్పా కార్తీక్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ జాయింట్ సెక్రటరీ విక్రమసింహానాయక్, గిరిజన సంఘం నాయకులు దుశ్శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. తనను రాష్ట్ర ఎస్టీ సెల్ సెక్రటరీగా నియమించడంపై విక్రమసింహానాయక్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు శివశంకర్ నాయక్, రవి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

వెలుగోడు: రాష్ట్రంలోని వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని షాదీ ఖానాలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు శిల్పా కార్తీక్‌రెడ్డి పాల్గొని సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులతో వలంటీర్లను ప్రశంసాపత్రం, నగదు పురస్కారంతో సత్కరించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

గుంకందాల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకృష్ణుడి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి విరాళం ఇచ్చారు. తన సొంత నిధులు రూ. 50 వేలు ఆలయ కమిటీకి తన తనయుడు శిల్పా కార్తీక్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, ఎంపీడీఓ సయ్యద్ ఉమర్, సర్పంచ్ వేల్పుల జయపాల్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, ఎంపీపీ లాలం రమేష్, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, మోడిమేల సుధాకర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో టీడీపీ గల్లంతవ్వడం ఖాయం

నందికొట్కూరు: రాష్ట్రంలోనే తెలుగు దేశం పార్టీ జాడ ఎక్కడా కనిపించడం లేదని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గల్లంతు కావడం ఖాయమని శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగే సిద్ధం సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. చంద్రబాబు స్వార్థ రాజకీయాలను తిప్పికొట్టేందుకు ప్రజలు సిద్ధం కావాలని చెప్పారు. ఒంటరిగా పోటీ చేసే దమ్ము లేక పొత్తుల కోసం చంద్రబాబు వెంపర్లడుతున్నారన్న విషయం ప్రజలు గమనించాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమానికి సీఎం వైఎస్ జగనన్న పెద్ద పీట వేశారన్నారు. మీ బిడ్డ సీఎం వైఎస్ జగనన్న శీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

సిద్ధం సభను విజయవంతం చేయండి

రాప్తాడు సిద్ధం సభలో వైఎస్సార్‌సీపీ శ్రేణులకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశా నిర్దేశం చేస్తారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధమయ్యే సమయం ఆసన్నమైందని గుర్తు చేశారు. పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. ఆదివారం అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగే సిద్ధం సభ చరిత్రలో నిలుస్తుందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పాములపాడులో సిద్ధం పోస్టర్‌ను విడుదల ప్రదర్శిస్తున్న సర్పంచులు, నాయకులు

సిద్ధం సభకు భారీగా తరలివెళ్తాం

పాములపాడు: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం నిర్వహించనున్న సిద్ధం సభకు మండలం నుంచి భారీగా తరలి వెళ్తామని రుద్రవరం సర్పంచు రామస్వామి, తుమ్మలూరు సర్పంచు వరప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో సిద్ధం పోస్టర్‌ను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు సిద్ధం సభకు తరలివెళ్లేందుకు ఉత్సాహంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర రెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏళ్ల నాటి సమస్యలకు పరిష్కారం



సీసీ రోడ్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: పట్టణంలో ఎన్నో ఏళ్ల నుంచి పరిష్కారానికి నోచుకోని సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలను తమ ప్రభుత్వం పూర్తి చేయడం చాలా సంతోషంగా ఉందని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 14వ, 16వ వార్డుల్లో ప్రత్యేక నిధుల ద్వారా జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణాలను చైర్మన్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గత పాలనలో ఎన్నడూ లేని విధంగా పట్టణాభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. సంక్షేమ పథకాలే జగనన్నను మళ్లీ గెలిపిస్తాయని చెప్పారు. కౌన్సిలరు అశోక్, కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గుర్రాల భాస్కరరెడ్డి, రజినీకుమార్‌రెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పూరీ ఠాకూర్ సేవలు మరువలేనివి

ఆత్మకూరు: భారత ప్రభుత్వం కార్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఇచ్చి గౌరవించడం ఎంతో సంతోషకరమని నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పగిడ్యాల శివ అన్నారు. పట్టణంలోని నాయీబ్రాహ్మణ సంఘం కార్యాలయంలో శనివారం కార్పూరీ ఠాకూర్ వర్ధంతి సభను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు శివన్న, ఎల్లప్ప, గువ్వలకుంట్ల వెంకటేశ్వర్లు, పెద్దస్వాములు, గాలన్న తదితరులు పాల్గొన్నారు.



కార్పూరీ ఠాకూర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

అంతిమంలోనూ అండగా నిలిచిన వలంటీర్



ఆర్థిక సాయం అందజేస్తున్న వలంటీర్, ఎండీయూ సిబ్బంది

వెలుగోడు: అనారోగ్యంతో ప్రాణాలు కోల్పోయిన నిరుపేద అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు ఆర్థికసాయం చేసి మానవత్వం చాటుకున్నారు వెలుగోడు మండలం గుంతకందాల గ్రామ వలంటీర్ ప్రశాంతి, రేషన్ డోర్ డెలివరీ ఎండీయూ ఆపరేటర్ గూడెం రాజు. గ్రామానికి చెందిన చాబోలు ఆనంద్ శనివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మరణించారు. ఇతనిది చాలా నిరుపేద కుటుంబం. వీరి ఆర్థిక పరిస్థితిని గుర్తించిన గ్రామ వలంటీర్ ప్రశాంతి రూ.3000 నగదు, ఎండీయూ ఆపరేటర్ గూడెం రాజు రూ.4000 భూస్థాపన ఖర్చుల నిమిత్తం మృతుని కుటుంబానికి అందజేసి అండగా నిలిచారు.

క్రీడా నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి

పగిడ్యాల: రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని క్రీడా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని ఉమ్మడి కర్నూలు జిల్లా ఖో ఖో అసోసియేషన్ చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన 56వ సీనియర్ ఖో ఖో శిక్షణా క్యాంప్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఆడుదాం .. ఆంధ్ర పోటీలలో పాల్గొన్న క్రికెట్ క్రీడాకారుడు కిలాడి పవన్ రాష్ట్రస్థాయిలో రాణించడం వలన ఐపీఎల్ తరుపున సీఎస్‌కే జట్టు దత్తత తీసుకుందని చెప్పారు. ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహించడం వలన ప్రతిభావంతులైన ఎంతో మంది క్రీడాకారులు వెలుగులోకి వచ్చారన్నారు. ఎంఈఓలు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి, హెచ్ఎం మధుసూదన్‌రావు, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, జాతీయ క్రీడాకారుడు మోక్షేశ్వరరెడ్డి, క్రీడాశ్రీ పీతాంబరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పుల్యాల నాగిరెడ్డి

మద్యం మత్తులో బావిలో పడి వ్యక్తి మృతి

జూపాడుబంగ్లా: మద్యం మత్తులో బావిలోని నీటిని తెచ్చేందుకు వెళ్లిన మండడి రామపుల్లారెడ్డి(44)అనే వ్యక్తి కాలుజారిపడి మృతిచెందిన ఘటన మండలంలోని తరిగోపుల గ్రామంలో శనివారం చోటుచేసుకొంది. ఏఎస్ఐ మేరీ జయంతి, మృతుని తల్లి వెంకటలక్ష్మమ్మ తెలిపిన వివరాల మేరకు.. మండడి చంద్రశేఖర్ రెడ్డి, వెంకటలక్ష్మమ్మ దంపతుల కుమారుడు రామపుల్లారెడ్డి. మృతుని భార్య మూడేళ్ల క్రితం మృతిచెందగా వీరికి గోవిందరెడ్డి, పవిత్ర అనే ఇద్దరు పిల్లలున్నారు. భార్య మరణానంతరం మద్యం తాగుడుకు అలవాటుపడిన రామపుల్లారెడ్డి ఈనెల 15న సాయంత్రం పూటుగా మద్యం సేవించి కల్లంలోని బర్రెలకు నీళ్లు తాపేందుకు సమీపంలో ఉన్న దిగుడుబావిలోని నీటిని తెచ్చేందుకు వెళ్లాడు. బావిలోని నీటిని బిందెలో నింపుతుండగా కాలుజారి బావిలో పడి మృతిచెందాడు. కల్లంలోని బర్రెలకు నీళ్లుతాపేందుకు వెళ్లిన రామపుల్లారెడ్డి ఎంతకీ ఇంటికి చేరుకోకపోవటంతో కనిపించిన వారందర్నీ అడిగటంతో పాటు తెలిసిన బంధువులందరికీ ఫోన్‌చేసి అడిగినా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురయ్యారు. శుక్రవారం ఉదయం కల్లం సమీపంలోని బావిలో రామపుల్లారెడ్డి మృతదేహం తేలడంతో అతని పిల్లలు, తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకొని బావిలోంచి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరుకు తరలించారు. తల్లి వెంకటలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ప్రతి కాలనీలో సీసీ రోడ్లు

పాములపాడు: పంచాయతీ పరిధిలోని ప్రతి కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టామని సర్పంచు వరప్రసాద్ తెలిపారు. శనివారం మండలంలోని తుమ్మలూరు గ్రామ పంచాయతీ పరిధిలోని క్రిష్టారావుపేట ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక చొరవ చూపుతోందన్నారు. ఈ క్రమంలోనే పంచాయతీలోని అన్ని కాలనీల్లో పంచాయతీ నిధులు, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న అంతర్గత రహదారిలో గ్రామ పంచాయతీ నిధులతో రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, ఉబేదుర్ రహిమాన్, మత్తయ్య, సంజీవ్, సత్యాలు, ఏసేపు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచు వరప్రసాద్

'జల్ జీవన్'తో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు

పాములపాడు: జల్‌జీవన్ మిషన్ పథకంతో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు అందించనున్నట్లు జల్ జీవన్‌మిషన్ జిల్లా ప్రాజెక్టు పర్యవేక్షణ విభాగం సమన్వయకర్త భీమశంకర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జల్ జీవన్ మిషన్ పనుల్లో కమ్యూనిటీ కాంట్రాక్ట్ పద్ధతి పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ మిషన్ పనుల నిర్వహణకు గ్రామ స్థాయిలో గ్రామ జల సంఘాలు ఏర్పాటు చేసి కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ పద్ధతి ద్వారా పనులు నిర్వహించాలన్నారు. పనులు అమలు చేయడంలో గ్రామీణ నీరు, పరిశుద్ధ్య శాఖా విభాగం నోడల్ ఏజెన్సీగా ఉండి పర్యవేక్షిస్తుందని చెప్పారు. ఈ సంఘంలో 9 మంది డ్వాక్రా మహిళలు సభ్యులుగా, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కన్వీనర్‌గా, పంచాయతీ కార్యదర్శి ఎక్స్ అఫీషియోగా ఉంటారన్నారు. ఏఈ అనిల్‌చంద్ర పునేట, ఏపీఎం అనురాధ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

కొత్తపల్లి: గ్రామీణ ప్రాంతాలలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన త్రాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జల్‌జీవన్‌మిషన్ జిల్లా ప్రాజెక్టు పర్యవేక్షణ విభాగం జిల్లా సమన్వయకర్త వి.భీమశంకర్ రెడ్డి సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ జవహర్‌బాబు అధ్యక్షతన జేజేఎం పనుల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ త్రిలింగేశ్వర రెడ్డి, వెలుగు ఏపీఎం పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జల్ జీవన్‌మిషన్ జిల్లా ప్రాజెక్టు సమన్వయకర్త భీమశంకర్‌రెడ్డి

ఇంటింటికీ తాగునీటి కుళాయి

నందికొట్కూరు రూరల్ : జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేస్తున్నట్లు భీమశంకర్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీవో నరేష్‌కృష్ణ అధ్యక్షతన కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ పద్ధతిపై అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

నీటి సమస్య పరిష్కరించండి

మిడుతూరు : స్థానిక చాకలిపేట, నాయీబ్రాహ్మణ వీధి తదితర కాలనీల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని, ఈ సమస్యను పరిష్కరించాలని శనివారం ఎంపీడీఓ గంగావతికి ఆయా కాలనీవాసులు మొరపెట్టుకున్నారు. ఆయా కాలనీల్లో నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు.

కొనసాగుతున్న తిక్కస్వామి ఉరుసు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సాయిబాబ నగర్‌లో వెలసిన తిక్కస్వామి దర్గా ఉరుసు మూడవ రోజు శనివారం కొనసాగియింది. ఈ సందర్భంగా స్వామివారికి భక్తులు పూలమాలలు, చాదర్లు సమర్పించి ఫాతెహాలు చేపట్టారు. దర్గా నిర్వహకులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం, రాత్రి వేళల్లో అన్నప్రసాద వితరణ గావించారు.

సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటించాలి



ఎస్పీ రఘువీర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న వైద్యులు

నంద్యాల టౌన్: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఎవరైనా మృతి చెందితే వైద్యుల నిర్లక్ష్యం వలన రోగి మృతి చెందాడని మృతుని బంధువులు భావిస్తే వైద్యులపై ఫిర్యాదు చేసే సమయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటించాలని నంద్యాల ఐఎంఏ వైద్యులు కోరారు. శనివారం ఈ మేరకు జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షుడు, యాక్షన్ కమిటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ రోగికి సరైన వైద్యం అందలేదని భావిస్తే ఆసుపత్రి, వైద్యుడిపై కేసు నమోదు చేసే హక్కు బాధితులకు ఉందన్నారు. అయితే కేసు నమోదు సమయంలో పోలీసు సిబ్బంది సుప్రీంకోర్టు తీర్పులను అనుసరించి ముందుగా ఆ వైద్య విభాగానికి చెందిన ప్రభుత్వ వైద్యులతో కూడిన కమిటీ విచారణ చేసి, రికార్డులు పరిశీలించి ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని భావించిన ప్పుడే కేసు నమోదు చేయాలని గుర్తు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు, చట్టాలకనుగుణంగా చర్యలు చేపడతామని చెప్పారు. ఐఎంఏ నంద్యాల అధ్యక్షురాలు డాక్టర్ వసుధ రాణి, కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్ పాల్గొన్నారు.

12వ పీఆర్సీ ఇవ్వాలి

నందికొట్కూరు: ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పీఆర్‌సీని వెంటనే ఇవ్వాలని ఏపీ జేఏసీ చైర్మన్ రాముడు, సెక్రటరీ సత్యనారాయణ కోరారు. శనివారం పట్టణంలోని ఎన్‌జీఓ భవనం నుంచి పటేల్ సెంటర్, తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద పీఆర్‌సీ వెంటనే విడుదల చేయాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ నాయకులు సుధాకర్, ఆంజనేయులు, విక్రాంత్, నారాయణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి చెల్లించాలి

ఆత్మకూరు: ప్రభుత్వం ఉద్యోగులకు 12వ పీఆర్సీలో మధ్యంతర భృతి చెల్లించాలని ఏపీ జేఏసీ అధ్యక్షులు మోహన్‌రెడ్డి, కార్యదర్శి సాజిద్‌బాషా కోరారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులు జనార్ధన్, అచ్చయ్య, బాషా, కలిముల్లా తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రయిస్తే కేసులు

నందికొట్కూరు: నాటుసారా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని టౌన్ సీఐ ప్రకాష్ కుమార్ హెచ్చరించారు. శనివారం పట్టణ శివారు ఆత్మకూరు రోడ్డు జమ్మిచెట్టు వద్ద పోలీసులు దాడులు నిర్వహించారు. పాములపాడు మండలం వేంపెంట గ్రామానికి చెందిన శివనాయక్ కర్నూలుకు తరలిస్తున్న 12 లీటర్లు నాటుసారా, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. సీఐ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధిపొంది సారా తయారుకు స్వస్తి పలకాలని చెప్పారు. పద్ధతులు మార్చుకోకపోతే పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపడం ఖాయమన్నారు. సారా తరలిస్తున్న శివనాయక్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

177 మంది వలంటీర్లకు అవార్డులు

జూపాడుబంగ్లా: మండలంలోని 11సచివాలయాల పరిధిలో వలంటీర్లుగా విధులు నిర్వర్తిస్తున్న 177 మందిలో ఇద్దరు సేవావజ్ర, ఐదు మంది సేవా రత్న, 170 మంది సేవామిత్ర అవార్డులకు ఎంపికైనట్లు ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా186మంది వలంటీర్లు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 177మంది వలంటీర్లు విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. వారిలో ఉత్తమ సేవలు అందించిన వారిని అవార్డులకు ఎంపిక చేశామన్నారు. వీరికి నగదుతో పాటు మెడల్స్ అందజేస్తామని చెప్పారు.

19న 'వలంటీర్లకు వందనం'

కొత్తపల్లి: మండలంలో ఈనెల 19న వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జవహర్‌బాబు శనివారం తెలిపారు. మండలంలో 157 మంది గ్రామవలంటీర్లు ఉండగా ఇందులో ప్రభుత్వం గ్రామాలలో వారి సేవలను గుర్తించి 146 మందిని అవార్డులకు ఎంపిక చేసిందని చెప్పారు. ఇందులో ఐదుగురు సేవారత్న, 141 మందికి సేవా మిత్ర అవార్డులకు ఎంపికయ్యారని తెలిపారు. వీరికి 19న స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

మహానందిలో ..

మహానంది: మండలంలో ఈ నెల 19న వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివనాగజ్యోతి శనివారం తెలిపారు. స్థానిక శాలివాహన నిత్యాన్నసత్రం భవనంలోని హాలులో వలంటీర్లకు ప్రభుత్వం అందించిన పురస్కారాలను పంపిణీ చేసేందుకు ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వలంటీర్లను సత్కరిస్తారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, సెక్రటరీలు అందరూ హాజరు కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.